క్లుప్తంగా

వరసిద్ధునికి చాపలు విరాళం



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి శనివారం ఓ భక్త బృందం చాపలను విరాళంగా అందజేసింది. సంకటహర చతుర్థి వ్రతం పూజలు చేసుకునే వారి కోసం కర్ణాటక రాష్ట్రం ముల్‌బాగల్‌కు చెందిన రమేష్ మిత్ర బృందం 300 చాపలను విరాళంగా ఇచ్చింది. అనంతరం వారికి ఆలయ ఏఈవో రవీంద్రబాబు ప్రత్యేక దర్శనం భాగ్యం కల్పించారు.

వరసిద్ధుని సేవలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో స్వామి ఆశీర్వచనం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఎస్‌ఐ ధరణీధర, సిబ్బంది వాసు, బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న తులసీరామ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులో సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవకులకు డాక్టరేట్ వరించింది. భారత్ వర్చువల్ యూనివర్సిటీ పీస్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జీవిత సాఫల్య పురస్కారానికి నగరానికి చెందిన సేవకులు తులసీరామ్, పార్థసారథినాయుడు ఎంపికయ్యారు. బెంగళూరులో శనివారం జరిగిన ప్రదానోత్సవంలో డాక్టరేట్ అందుకున్నారు. బలిజ సంఘం నేతలు విశ్వనాథ్, బాలాజీ, శేఖర్ ఘనంగా సన్మానించారు.

లారీని ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలంలో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన లారీని బైక్ ఢీకొన్న ఘటనలో శనివారం ఒకరు మృతి చెందగా..మరొకరు గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కిచ్చన్నగారిపల్లి వద్ద తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా కట్టపట్టికి చెందిన లారీ డ్రైవర్ నిబంధనలకు విరుద్ధంగా లారీని పార్కింగ్ చేశాడు. ఆ మార్గంలో జీడీ నెల్లూరు మండలం ఎల్లంరాజుపల్లికి చెందిన తేజ, మోహన్‌రెడ్డి (20)అనే ఇద్దరు యువకులు తిరుపతి వైపు మోటారుసైకిల్‌లో వెళుతున్నారు. ఈ క్రమంలో వారు లారీని బలంగా ఢీకొన్నారు. దీంతో తేజ తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. మోహన్‌రెడ్డి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటనలో బైక్ నుజ్జునుజ్జు అయ్యింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

గుడిపాల: గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య తెలిపారు. రామభద్రాపురం పంచాయతీలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త, వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

దిగువమాసాపల్లిలో గందరగోళం

- పదవి కోసం టీడీపీలోని ఇరువర్గాలు పట్టు
- మిగిలిన చోట్ల ఏకపక్షం
- సాగునీటి సంఘాల పోరు తీరు
- అన్ని మండలాల్లో ఏకగ్రీవంగా ముగిసిన ఎన్నికలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని దిగువమాసాపల్లిలో మాత్రం సాగునీటి సంఘం ఎన్నికలు గందరగోళంగా సాగాయి. పదవి కోసం టీడీపీలోని ఇరువర్గాలు పట్టుపట్టాయి. నువ్వా–నేనా అంటూ మధ్యాహ్నం వరకు కుస్తీ పట్టాయి. మిగిలిన చోట్ల సాదాసీదాగా సాగిపోయాయి. గుట్టు చప్పుడు కాకుండా ఏకగ్రీవం చేసుకుని వెళ్లిపోయారు.

చిత్తూరు మండలం దిగువమాసాపల్లి చెరువు సాగునీటి సంఘ ఎన్నికలు స్థానిక ఎంపీపీ పాఠశాలలో నిర్వహించారు. ఉదయం 9 గంటల సమయంలో ఎన్నికల అధికారులు ప్రక్రియను మొదలుపెట్టారు. టీడీపీకి చెందిన ఇరువర్గాలు జనసమీకరణ చేసుకుని ఎన్నికల కేంద్రానికి చేరుకున్నాయి. ఈ హడావుడి గమనించిన పరిసర గ్రామాల ప్రజలు బడి చుట్టూ చేరిపోయారు. అక్కడే రైతులకు అల్పాహారం కూడా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మొదలైన పోరు మధ్యాహ్నం వరకు కొనసాగింది. పోటీకి సై అంటూ ఓ వర్గం గట్టిగా నిలబడింది. మరో వర్గం ఆచి తూచి అడుగులు వేస్తూ వచ్చింది. ఏకగ్రీవం చేసుకోవాలని పట్టుపట్టింది. ఈ క్రమంలో ఇరువర్గాలకు స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. చివరకు మండల నాయకుల జోక్యంతో ఏకగ్రీవమైంది. మండల నాయకుల అండ ఉన్న వర్గం వైపు విజయం వరించింది. ఎన్నికల అధికారులు సభ్యుల పేర్లను ప్రకటించారు. దీంతో ఓ వర్గం నెమ్మదిగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. మరో వర్గం ఉత్సాహంలో మునిగిపోయింది. గతంలో ఎన్నికల దృష్ట్యా ఎస్‌ఐ వెంకట సుబ్బమ్మ తన సిబ్బందితో ముందస్తుగానే ఎన్నికల కేంద్రానికి చేరుకున్నారు. ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికల నిర్వహణ చర్యలు చేపట్టారు. చిత్తూరు నియోజకవర్గంలోని మిగిలిన 12 చెరువులకు ఏకపక్షంగా జరిగిపోయాయి. ఐరాల, పూతలపట్టు, యాదమరి, తవణంపల్లె, బంగారుపాళ్యం మండలాల్లోని 40 చెరువులకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. అంతా కూటమి నేతలే పదవులను దక్కించుకున్నారు. ముందస్తుగానే సర్దుబాటు చేసుకుని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. కొన్ని చోట్ల అయితే రైతులకు, ప్రజలకు నీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయనే సమాచారం కూడాలేదు. గతంలో ఎన్నికలంటే దండోరా వేయించే వారు.. ఇప్పుడు ఎన్నికలకు పోటీ పెరుగుతుందని స్థానిక కూటమి నేతలు దండోరా వేయించకుండా అధికారుల చేతులు కట్టేశారు. దీంతో నాయకులకు అనుకూలమైన వ్యక్తులకే నీటి సంఘాల్లో పదవులు నీటి బుడగల్లా తేలాయి.



దిగువమాసాపల్లిలో వాగ్వాదానికి దిగిన టీడీపీ నేతలు



జంబువారిపల్లె వెంకటప్పనాయుని చెరువు సభ్యులకు డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న అధికారులు

సాగునీటి ఎన్నిక ఏకపక్షం

గుడిపాల: మండలంలోని ఆరు సాగునీటి సంఘాల చెరువులకు సంబంధించి ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో వసంతాపురం బంగారక్క చెరువుకు చైర్మన్‌గా ధనంజయనాయుడు, వైస్ చైర్మన్‌గా నవీన్‌కుమార్, పానాటూరులోని ఓంనమశివాయ చెరువుకు చైర్మన్‌గా శకుంతల, వైస్ చైర్మన్‌గా మురళీమోహన్, పాపసముద్రంలోని రామిరెడ్డి చెరువుకు చైర్మన్‌గా చిన్న కోవిందమ్మ, వైస్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌నాయుడు, నారగల్లు చెరవుకు చిట్టిబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా జైల్‌సింగ్, నంగమంగళం చెరువుకు చైర్మన్‌గా సునీత, వైస్ చైర్మన్‌గా బాబు, బొమ్మినాయుని చెరువుకు చైర్మన్‌గా ధనలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కన్నన్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

ఐదు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

తవణంపల్లె: మండలంలోని ఆరు సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని గాజులపల్లె ఆనకట్ట సిస్టం, రామన్న చెరువు, మేడివంక ఆనకట్ట సిస్టం, పుణ్యసముద్రం పెద్ద చెరువు, పట్నం పెద్దచెరువు, కుయ్యవంక ఆనకట్ట సిస్టం నీటి వినియోగదారులు సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో గాజులపల్లె ఆనకట్ట సిస్టం, రామన్న చెరువు, మేడివంక ఆనకట్ట సిస్టం, పుణ్యసముద్రం పెద్ద చెరువు, పట్నం పెద్దచెరువు సాగునీటి వినియోగదారుల సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కానీ కుయ్యవంక ఆనకట్ట సిస్టం నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నితిన్ తెలిపారు. కుయ్యవంక ఆనకట్ట సిస్టం కింద 93 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఆరుగురు నీటి తీరువా చెల్లించి ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేశారు. నీటి వినియోగదారులు సంఘంలో పోటీ చేసే రైతులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఎన్నికల అధికారికి సమర్పించాల్సి ఉంది. కానీ వీఆర్‌ఓ ఎన్నిక సమయంలో రైతులకు అందుబాటులో లేక నీటి తీరువా చెల్లించినా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో అధికారులు ఎన్నికలు వాయిదా వేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

సాగునీటి సంఘ ఎన్నికలు ఏకగ్రీవం

బంగారుపాళెం: అందరూ ఊహించినట్లుగానే అధికార పార్టీ అధికారులను గుప్పిట్లో పట్టుకుని సాగునీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవం చేసుకున్నారు. మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలో ఏడు చెరువులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించగా అన్నీ ఏకగ్రీవమైనట్లు చెప్పారు. 7 చెరువులకుగాను 42 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా అందులో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నట్లు తెలిపారు.





గుడిపాల: ఎన్నికల్లో నిమగ్నమైన అధికారులు, పట్నం పెద్దచెరువు అధ్యక్షుడు లవకుమార్‌కు ధృవీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించాలి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించాలని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు అన్నారు. నగరంలోని సుందరరాజపురంలో శనివారం ఉన్న విజయం సీబీఎస్‌ఈ పాఠశాలలో క్రీడోత్సవాలు నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల పట్ల మక్కువ సాధించాలన్నారు. క్రీడలనేవి కేవలం ఉల్లాసం మాత్రమే కాదన్నారు. క్రీడల వల్ల మానసిక ఒత్తిడిని పోగొట్టుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు క్రీడలు, యోగా వంటివి నిత్యజీవితంలో భాగంగా అలవాటు చేసుకుంటే జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయన్నారు. చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ 18 ఏళ్లకే ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పలు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శైలజ, ప్రిన్సిపల్ కౌసల్య, విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులందజేస్తున్న సీఐ నిత్యబాబు

విద్యుత్ భారం ప్రభుత్వమే భరించాలి

- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని తీర్చాలి
- విద్యుత్ వినియోగదారుల సంఘం నాయకుల డిమాండ్

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులపై పడే భారం రూ.18వేల కోట్లను ప్రభుత్వమే భరించాలని నాయకులు తెలిపారు. చిత్తూరులోని ఓ హోటల్లో శనివారం విద్యుత్ వినియోగదారుల సంఘం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చైతన్య మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలో వచ్చిన వెంటనే పెంచడం అన్యాయమన్నారు. పీఠమెక్కిన ఆరు నెలల వ్యవధిలో రెండు మార్లు ఇంధన సర్దుబాటు చార్జీలు వేయడం సరికాదన్నారు. ఈ పెంపు విధానం జనవరి–2026 వరకు కొనసాగనుందని చెప్పారు. చలికాలంలో వస్తున్న విద్యుత్ బిల్లు ఎండా కాలాన్ని తలపిస్తోందన్నారు. ఒకవైపు నిత్యావసరాల ధరలు పెరుగుతున్నా వాటిని నియంత్రించడం లేదని విమర్శించారు. అద్దె నివాసాల్లో ఉండే వారికి వేలల్లో కరెంటు బిల్లు వస్తోందన్నారు. వాడకం తక్కువగా ఉన్నా ట్రూ–అప్ చార్జీల పేరిట అదనపు బాదుడు బాదుతోందని చెప్పారు. ప్రీపెయిడ్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయరాదన్నారు. కార్యక్రమంలో నాయకులు అజంతుల్లా, శ్రీనివాసమూర్తి, సురేంద్రనాథ్, షౌకత్, మునస్వామి, రాబర్ట్, రషీద్, కేశవులురెడ్డి పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

14 సాగునీటి సంఘాలు ఏకగ్రీవం

ఐరాల: మండలంలోని 14 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఇరిగేషన్ ఏఈ మాలతి తెలిపారు. మండలంలోని 14 ఇరిగేషన్ చెరువులకు సాగునీటి వినియోగదారుల సంఘం కమిటీల ఏర్పాటుకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. 14 ఇరిగేషన్ చెరువుల కింద సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నికల అధికారులు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటిస్తూ ధృవీకరణ పత్రాలను అందజేశారు.

అంటువ్యాధులపై అప్రమత్తం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: గ్రామీణ ప్రజలు అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. కాలానుగుణంగా వచ్చే అంటువ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవాలని తెలిపారు. శీతాకాలంలో వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం





రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ, వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ఆరోగ్యమే మహాభాగ్యమని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. ఆయన మండలంలోని కారకాంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, రోగులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. రోగులకు ఆరోగ్య సూత్రాలు గురించి వివరించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. జ్వరాలు సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చారాలలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని చారాలలో డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చారాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 40 మంది రోగులకు పరీక్షలు చేయించి సూచనలందించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్హాపూర్ సీతాఫలం..లాభదాయకం

గుడిపాల మండలంలోని రైతులు కొల్హాపూర్ సీతాఫలాన్ని సాగు చేయడం ఆరంభించారు. సాగు ఖర్చులు తక్కువ కావడం, ఏడాది రెండుసార్లు దిగుబడి వస్తుండడం..ఐదేళ్ల తరువాత ఎకరాకు సరాసరి రూ. 25 లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో ఇక్కడి రైతులు సీతాఫలం సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

- ఏడాదికి రెండు సార్లు దిగుబడి
- ఐదేళ్ల తరువాత మరింత ఆదాయం
- సాగు ఖర్చులు తక్కువ
- మక్కువ చూపుతున్న రైతులు



వసంతాపురంలో సాగు చేస్తున్న సీతాఫలం చెట్లు

గుడిపాల: మహారాష్ట్రలో విస్తృతంగా సాగవుతున్న సీతాఫలాలకు ఇక్కడ డిమాండ్ పెరిగింది. ఏటా రెండుసార్లు దిగుబడి వచ్చే ఈ సీతాఫలం ఒక్కసారి నాటితే 20 ఏళ్లకు పైగా దిగుబడినిస్తుంది. సాధారణ ఎరువులు తప్పితే ప్రత్యేకించి ఎరువులు వాడాల్సిన అవసరం లేదు. చీడపీడల బాధ అసలే లేదు. సమీపంలోనే వేలూరు, చెన్నై నగరాలు ఉండడంతో మార్కెటింగ్ సమస్య కూడా లేదు. ఏకంగా వ్యాపారులే తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తుండడంతో క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గుడిపాల మండలంలో ప్రస్తుతం 30 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మరో 50 ఎకరాల్లో సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు.



సాగులో ఉన్న సీతాఫలం చెట్లు

మూడేళ్లకు దిగుబడి

సాధారణంగా సీతాఫలం సంవత్సరానికి ఒకసారి మాత్రమే దిగుబడి వస్తుంది. ప్రకృతి సిద్ధంగా అడవులు, పొలం గట్లపై వచ్చే సీతాఫలం ఇప్పటి వరకు చూసాం. కానీ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో సాగయ్యే సీతాఫలం సంవత్సరానికి రెండుమార్లు దిగుబడి వస్తుంది. అక్కడ రైతులు ఇతర పంటల తరహాలో బోరు బావుల వద్ద సీతాఫలం సాగు చేస్తున్నారు. ఈ రకం సీతాఫలాన్ని ప్రస్తుతం గుడిపాల మండలం వసంతాపురంలో సాగు చేస్తున్నారు. అక్కడి నుంచి మొక్క రకాన్ని బట్టి రూ.50 నుంచి 100 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా పొలంలో 250 చెట్ల వరకు నాటుతారు. మూడేళ్లలో దిగుబడి వస్తుంది. పెద్దగా ఎరువులు అవసరం లేదు. సాధారణ తిప్ప ఎరువులు వాడుకుంటే చాలు. నీటి అవసరం కూడా తక్కువే. ఐదేళ్ల తరువాత ఒక్కో చెట్టుకు సీజన్‌కు 100 కిలోల వరకు దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.120 వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఐదేళ్ల తరువాత ఎకరాకు రూ.25 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం లేకపోలేదు. మొక్కల సంరక్షణపై ఒకింత శ్రద్ధ వహిస్తే చెట్లు 20 ఏళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో ఇక్కడి రైతులు ఈ సీతాఫలం సాగుపై మక్కువ చూపుతున్నారు.

ప్రతి రైతు 2 ఎకరాలు సాగు చేస్తే చాలు

ప్రతి రైతు రెండు ఎకరాల్లో కొల్హాపూర్ సీతాఫలం సాగు చేసుకుంటే చాలు ఐదేళ్లలో లక్షలాధికారులు కావడం ఖాయం. తక్కువ ఖర్చుతో ఎలాంటి రోగాలు లేకుండా సీతాఫలం సాగు చేయవచ్చు. ఒకసారి మొక్క నాటితే 20 ఏళ్లకు పైగా ఉంటుంది. దీంతో సాగు పెట్టుబడి అవసరమే లేదు. సంవత్సరంలో రెండుమార్లు దిగుబడి వస్తుంది. సరాసరిన ఐదేళ్ల తర్వాత ఎకరా పొలంలో రూ.25 లక్షలు ఆదాయం చూడటం సాధ్యమే. నేను నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నా. ఇప్పుడిప్పుడే దిగుబడి వస్తోంది. మరో సంవత్సరంలో పూర్తిస్థాయి దిగుబడి వస్తుంది.

– రాజయ్య, వసంతాపురం